# పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి కృషి చేయాలి

● జిల్లా సెక్టోరియల్ అధికారి రామచంద్రనాయక్



మునుగోడు : సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రామచంద్రనాయక్

మునుగోడు, డిసెంబర్ 5 : పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామచంద్రనాయక్ అన్నారు. మండలంలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ తొలిమెట్టు కార్యక్రమం విజయవంతానికి ఉపాధ్యాయుల నిరంతర కృషి ఆవసరమన్నారు. బోధనలో మెళకువలను అలవర్చు కునేలా, మరింత మెరుగు పరుచుకునేలా కాంప్లెక్స్ సమావేశాల్లో చర్చించాలన్నారు. తరగతి గదిలో పాఠ్యప్రణాళికతో పాటు పాఠ్య పుస్తకం, వర్క్ బుక్స్‌తో అనుసంధానం చేస్తూ విద్యా బోధన జరిగినప్పుడు మాత్రమే విద్యార్థుల్లో ఆశించిన సామర్థ్యాలు సాధించడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కత్తుల రవీందర్, లెంకల శ్రీనువాస్‌రెడ్డి, ఎండీ రఫీ,ఆర్పీలు రవికుమార్, పారిజాత,నాగేశ్వర్‌రావు, సీఆర్పీలు నర్సింహ, సతీశ్, నాగరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి : డీఈఓ భిక్షపతి

నల్లగొండ రూరల్ : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలని డీఈఓ భిక్షపతి సూచించారు. మండలంలోని దోమలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో క్లస్టర్ హెచ్ఎం కొమ్మ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. పది పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. అనంతరం మోడల్ పాఠాలు విన్నారు. పాఠ్యప్రణాళికలు, టెస్టు, బుక్స్ ,వర్క్ షీట్స్‌ను సమాంతరంగా నిర్వహిం చాల న్నారు. టీచర్ల డైరీ, మధ్యాహ్నభోజనం పరిశీలించారు. ఆయన వెంట ఏఎంఓ రామచంద్రయ్య, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

నకిరేకల్ :ఉపాధ్యాయులు బోధన మెళకువలు నేర్చుకొని విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని డీఈఓ భిక్షపతి ఉపాధ్యాయులకు సూచించారు. నకిరేకల్ జడ్పీహెచ్ఎస్ మంగళవారం జరుగుతున్న కాంప్లెక్స్ సమావేశాన్ని డీఈఓ బి. భిక్షపతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమ అమలు తీరును ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి సం తృప్తి వ్యక్తం చేశా రు. కార్యక్రమంలో ఎంఈఓ నాగయ్య, హెచ్ఎం కె.రాములు, ఎంఎన్ఓ కె. వీరారెడ్డి పాల్గొన్నారు.



నకిరేకల్ :జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈఓ భిక్షపతి

# మాజీ సీఎం కేసీఆర్‌కు సన్మానం

చిట్యాల, డిసెంబర్ 5 : తెలంగాణ ఉద్యమకారుడు, చిట్యాల 10వ వార్డు కౌన్సిలర్ గోధుమగడ్డ పద్మ భర్త జలంధర్‌రెడ్డి మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఆయన ఫామ్ హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ను శాలువాతో సన్మానించారు. అనంతరం సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.



కేసీఆర్‌ను శాలువాతో సన్మానిస్తున్న జలంధర్‌రెడ్డి

# గొంతును నులిపి చంపి.. మెట్లపై పడేసి

- ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- చౌటుప్పల్ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివాహేతర సంబంధమే కారణం ● నిందితులకు రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ మొగులయ్య



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మొగులయ్య

చౌటుప్పల్, డిసెంబర్ 5: ఈ నెల 2న చౌటుప్పల్ మండల కేంద్రంలోని వెంకటరమణ కాలనీలో రమావత్ వెంకటేశ్వర్లు(38) హత్య కేసును మంగళవారం పోలీసులు ఛేదించారు. వెంకటేశ్వర్లు భార్య సరోజ ప్రియుడు మహేశ్‌తో కలిసి హత్య చేసినట్లు తేల్చారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మొగులయ్య కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం కొక్కిరాలతండాకు చెందిన రమావత్ వెంకటేశ్వర్లు(38) అలియాస్ శ్రీను భార్య సరోజ, ఇద్దరు పిల్లలతో కలిసి చౌటుప్పల్‌కు వలసవచ్చి స్థానికంగా ఓ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తూ సమీపంలో ఉన్న వెంకటరమణకాలనీలో అద్దెకు ఉంటున్నాడు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం సిరిపురం గ్రామానికి చెందిన మాతంగి మహేశ్ కూడా మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డి గూడెంలో నివాసముంటూ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు భార్య సరోజకు మహేశ్‌తో సోషల్‌మీడియాలో పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం కొన్ని రోజుల క్రితం బయటకు రావడంతో భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సరోజ తన భర్తను హతమార్చాలని నిర్ణయించుకుంది. దాంతో ఈ నెల 2న అర్ధరాత్రి ప్రియుడు మహేశ్ సాయంతో ఆమె నిద్రిస్తున్న భర్తను తాడుతో గొంతునులిమి హత్యచేశారు. అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని సమీపంలోని నిర్మానుష్యంగా ఉన్న ఓ ఇంటి మెట్లపై పడవేశారు. స్థానికులు గమనించి ఉదయం ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే మృతుడి భార్య సరోజ అదే రోజు తన భర్త కనబడటం లేదని బంధువులకు చెప్పింది. దాంతో వారు సరోజపై అనుమానం వ్యక్తం చేస్తూ వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితులను పట్టుకొని రిమాండ్ తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ ఎస్.దేవేందర్, ఎస్ఐలు కే.యాదగిరి, ధనుంజయ్య, సిబ్బంది ఉన్నారు.

## సీబీఐటీ ఇన్‌స్పెక్టర్‌గా ఊట్కూరు వాసి



వంశీ

శాలిగౌరారం, డిసెంబర్ 5 : మండలంలోని ఊట్కూర్ గ్రామానికి చెందిన శీలం వంశీ సెంట్రల్ బోర్డు ఇండైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్(సీబీఐటీ) ఇన్‌స్పెక్టర్‌గా సెలక్ట్ అయ్యాడు. గత నెలలో నిర్వహించిన స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో సీజీఎల్ పరీక్షలో 1,700ర్యాంక్ సాధించి టాక్స్ అండ్ కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యాడు. వంశీ ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లోని శ్రీచైతన్య కళాశాల, ట్రిబుల్ ఐటీ మధ్యప్రదేశ్‌లో పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఇండియన్ పోస్టాఫీస్ పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తూనే ఎస్ఎస్‌సీ( స్టాఫ్ సెలక్షన్ కమిషన్) సీజీఎల్ కమాండ్ గ్రాడ్యుయేట్ లెవెల్‌లో మెరిట్ సాధించాడు. వంశీ తండ్రి శంకరయ్య గ్రామంలో ఆర్ఎంపీగా పని చేస్తున్నాడు. వంశీ సెంట్రల్ బోర్డులో సెలక్ట్ అయినందుకు గ్రామస్తులు అభినందించారు.

## తుపాన్ దృష్ట్యా చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● నల్లగొండ సీడీపీఓ నిర్మల

నీలగిరి, డిసెంబర్ 5 :తుపాన్ కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతోపాటు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని నల్లగొండ సీడీపీఓ తూముల నిర్మల అన్నారు. మంగళవారం పట్టణంలోని చర్లపల్లి సెక్టార్‌లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చిన గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులతో ఆమె మాట్లాడారు. చలి తీవ్రతను తట్టుకునేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌ఓల డ్యూటీ పూర్తయినందున స్కూల్ సక్రమంగా నిర్వహించడంతోపాటు రికార్డులు కూడా క్లియర్‌గా ఉండాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు సుశీల, పుష్పమ్మ ఉన్నారు.

# సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చూడాలి

● చౌటుప్పల్ మండల సమావేశంలో ఎంపీపీ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి

చౌటుప్పల్‌రూరల్, డిసెంబర్ 5 : మి చౌంగ్ తుపాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో సీజనల్ వ్యాధులు అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తాడూరి వెంకట్‌రెడ్డి కోరారు. చౌటుప్పల్ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇప్పించాలని సర్పంచులు కోరారు. అనంతరం బిల్లులు వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మాణం చేశారు. పెద్ద కొండూరు గ్రామ పంచాయతీలో రూ.16 లక్షల అవినీతి జరిగిందని అధికారులు తనపై కక్ష పూరితంగా వ్యవహరించారని సర్పంచ్ కాయితి రమేశ్ పేర్కొ న్నారు. మండలంలో ఎన్నికలకు ముందు చేపట్టిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఇప్పటి వరకు అయిన పనులకు బిల్లులు చెల్లించి ప్రారంభించని పనులకు కొత్త టెండరుదారులకు పనులు అప్పగించాలని ఎంపీపీ కోరారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు ఎస్‌డీఎఫ్ నిధులు గ్రామానికి రూ. 25లక్షలు మంజూరైనట్లు తెలిపారు. మండలంలోని నాగారం పీడబ్ల్యూరోడ్డు వర్కట్‌పల్లి నేలపట్ల రోడ్డుకు రూ.56 లక్షల ,తూప్రాన్‌పేట, నేషనల్ హైవే నుంచి ఎనగంటి తండా,కాట్రేవు వరకు రూ. 56 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని ఆర్అండ్ బీ అధికారులు తెలిపారు. మండలంలో మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు మంచినీటిని అందిస్తున్నట్లు ఏఈ తెలిపారు. 2023 –24లో 16,575 మంది రైతుల ఖాతాల్లో 20,18,35,233 నిధులు రైతుల అకౌంట్లో జమ అయినట్లు ఏఓ ముత్యాల నాగరాజు తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ బి సందీప్‌కుమార్, వైస్ చైర్మన్ ఉప్పుభద్రయ్య, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.



స్కాలర్‌షిప్‌లు పొందిన విద్యార్థులు, కంపెనీ ప్రతినిధులు

## విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

చౌటుప్పల్, డిసెంబర్ 5: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలో ప్రతిభకనబర్చిన 57 మంది విద్యార్థులకు లింగోజిగూడెం దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో మంగళవారం రూ.9 లక్షల మంగళవారం పంపిణీ చేశారు. నగదును ఆ పరిశ్రమ జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్ రావు కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బాతరాజు సత్యం, పరిశ్రమ అధికారులు బాలకిశోర్, సీహెచ్ వీరయ్య, కే.శివప్రసాద్, వల్లూరి వెంకటరాజు, బి.గోపి, జి.వెంకటేశ్వర్లు,ఎస్.సాయి కృష్ణా, వి.వంశీకృష్ణా పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి: జడ్పీటీసీ సురేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న జడ్పీటీసీ సురేందర్ రెడ్డి

మర్రిగూడ, డిసెంబర్ 5 :బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీని మరింత బలోపేతం చేయాలన జడ్పీటీసీ పాశం సురేందర్ రెడ్డి అన్నారు.మండలంలోని ఖుదాభక్షపల్లిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ కొత్త హామీలను అమలు చేయాల్సిన భాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం నిరంతరం కష్టపడి పనిచేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు,కార్యకర్తలు ఓటమిని స్పూర్తిగా తీసుకోవాలన్నారు.కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాబో యే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి ఖాయమని వెల్లడించారు. సమావేశంలో సర్పంచ్ ఆంబోతు సుధాకర్ నాయక్, ఉప సర్పంచ్ మైలారపు పార్వతమ్మాగిరేశ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు పందుల పాండు గౌడ్, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవం

చిట్యాల, డిసెంబర్ 5: చిట్యాలలోని భవిత కేంద్రం లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయుడు బోయ శ్రీనివాసు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, విజయలక్ష్మి, శ్రీదేవి, ఆవుల గీత, వరలక్ష్మి, సరిత, జాన్, ప్రవళిక పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న చిన్నారులు